GSTIN-NO:36FKPSI308PIZX
epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 6 | సంచిక : 334 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | ఆదివారం 28-07-2024 | పేజీలు : 3

## పొంచి ఉన్న ప్రమాదం

### ముంపు మండలాల్లో భయం



**టీ మీడియా,జులై 27,అల్లూరి :**
ముంపు మండలాల ప్రజలను వరద భయం వెంటాడుతోంది. డొంకరాయి సీలేరు జలాశయాల్లో సామర్థ్యానికి మించి వరద నీరు చేరింది. మళ్లీ జాతీయ రహదారి 30 వద్ద వరద నీరు చేరడంతో అక్కడి ప్రాంతమంతా ముంపుకు గురైంది. దీంతో భద్రాచలం చింతూరు రాజమహేంద్రవరం, చత్తీస్‌గడ్, ఒడిశా రాష్ట్రాలకు రవాణా మార్గం బంద్ అయ్యింది. ఎగువ నుండి వరద వేగం పెరగడంతో, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ్ కుమార్, ఏఇ,శివశంకర్, జెన్ కొ సిబ్బంది సివిల్ అధికారులు డొంకరాయి జలాశయం నుండి 10 వేల క్యుసెక్కుల నీటిని 4 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేశారు. చింతూరు వద్ద శబరి నీటిమట్టం 38 అడుగులకు చేరింది. భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 52 అడుగులకు చేరుకుంది. దీంతో ముంపు మండలాల్లోని ప్రజలను వరద ముంపు ప్రమాదం భయపెడుతోంది.

### అసెంబ్లీలో..

# రేవంత్ VS హరీష్‌రావు

- రంగారెడ్డి జిల్లాలో భూములన్నీ అమ్ముకున్నారు
- మూడు పథకాలపై విచారణకు సిద్ధమా
- మండిపడ్డముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రెడీ అంటూ హరీశ్ అన్సర్



**టీ మీడియా,జులై 27,హైదరాబాద్ బ్యూరో :**
అప్పుల విషయంలో గత కేసీఆర్ ప్రభుత్వంపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బురదజల్లే ప్రయత్నం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్‌పై చర్చ సాగింది. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలు పదేపదే కేసీఆర్ హయంలో రూ.7 లక్షల కోట్ల అప్పులు అయ్యాయని అవాస్తవాలు చెబుతున్నారని మండిపడ్డారు.2014లో తమ ప్రభుత్వం ఏర్పడేనాటికి వారసత్వంగా రూ.72 వేల కోట్ల అప్పులు వచ్చాయని తెలిపారు. ఈ రూ.7 లక్షల కోట్ల అప్పులలో కొన్ని చెల్లించినవి కొన్ని చెల్లించనివి ఉన్నాయన్నారు. ఇలా మొత్తంగా చూసుకుంటే తాము చేసిన అప్పు రూ.4 లక్షల కోట్లకు పైగా మాత్రమే ఉంటుందన్నారు.అయినా, తాము చేసిన అప్పుల గురించి చెబుతున్న కాంగ్రెస్ నేతలు తాము కూడబెట్టిన ఆస్తుల గురించి కూడా మాట్లాడాలని సూచించారు. సీతారామ ప్రాజెక్టు, దేవాదుల, సమ్మక్క బ్యారేజీ, కాళేశ్వరం ప్రాజెక్టు, పాలమూరు లిఫ్ట్ ఇరిగేషన్, సుందిళ్ల భక్తరామదాసు ప్రాజెక్టు ఇలా ఎన్నో ప్రాజెక్టులు కట్టి లక్షలాది ఎకరాలకు నీరు ఇచ్చామన్నారు. ఇదంతా తాము తయారు చేసిన ఆస్తులు కాదా? అని ప్రశ్నించారు. రైతు వేదికలు, కమాండ్ కంట్రోల్ రూమ్ ఇలా ఎన్నో నిర్మించామన్నారు.రైతుబంధుపై రూ.72 వేల కోట్లు, రైతు రుణమాఫీకి రూ.28 వేల కోట్లు, ఆసరా పెన్షన్‌కు ఇలా ఎన్నింటికో ఇచ్చామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రూ.31 వేల కోట్ల రైతు రుణ మాఫీ చేస్తామని చెప్పిందని, కానీ దానిని రూ.25 వేలకు తగ్గించిందని ఆరోపించారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడం సంతోషమేనని కానీ వైద్య శాఖకు నిధుల కేటాయింపు తగ్గిస్తే ఇది ఎలా సాధ్యం? అని ప్రశ్నించారు. అలాగే కేసీఆర్ పేరు నచ్చకుంటే పేరు మార్చి కిట్లు ఇవ్వాలని సూచించారు. కానీ రాజకీయాల కోసం పేదల కడుపు కొట్టవద్దని సూచించారు. ఆరు గ్యారెంటీలపై బాండ్ పేపర్ ఇచ్చి మరీ మోసం చేశారని మండిపడ్డారు. బాండ్ పేపర్ వ్యాల్యూ తీసేశారన్నారు.ఇక నాన్ ట్యాక్స్ రెవెన్యూలో రూ.35వేల కోట్లు వస్తుందని బడ్జెట్‌లో పెట్టారని తెలిపారు. గతంలో రుణమాఫీ కోసం భూములు అమ్మితే భట్టి, శ్రీధర్ బాబు విమర్శించారని.. ఇప్పుడు రూ.10 వేల కోట్ల భూములు అమ్మి నిధులు సమీకరిస్తామని చెప్పారని తెలిపారు. రూ.24వేల కోట్లు అదనంగా ఎలా తీసుకువస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. మీ మాటపై గౌరవం ఉంటే భూములు అమ్ముకునే ప్రతిపాదన ఉపసంహరించుకోవాలన్నారు.సాధ్యం కానీ తరహాలో ఆదాయం ఎక్కువ చూపారన్నారు. తప్పనిసరి ఖర్చులను తక్కువ చేసి చూపారని ఆక్షేపించారు. ఏకకాలంలో రుణమాఫీ అన్నారని.. కానీ బడ్జెట్‌లో రూ.26వేల కోట్లు మాత్రమే వస్తోందన్నారు. రుణమాఫీ ఇవ్వడం ఆలస్యం అయిందని రైతుల నుంచి బ్యాంకర్లు వడ్డీ వసూలు చేస్తున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం రుణమాఫీ ఆలస్యం చేసి రైతులపై భారాన్ని మోపుతుందని సీరియస్ అయ్యారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను తాము కొనసాగించామని గుర్తు చేశారు. కేసీఆర్ కిట్‌లాంటి పథకాల పేర్లు మార్చి పంపిణీ చేసినా తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు.అమ్మకాల లెక్కలు చెప్పడం లేదుహరీశ్ రావు అప్పుల లెక్క చెప్పే సమయంలో అమ్ముకున్న లెక్కలు ఎందుకు చెప్పడం లేదని సీఎం రేవంత్ నిలదీశారు. ప్రాజెక్టులు కట్టినందుకు అప్పులు అయ్యాయని చెబుతున్న మాజీ మంత్రి. భూములు అమ్మిన విషయం ఎందుకు చెప్పలేదన్నారు. లక్షల కోట్ల విలువైన ఓఆర్ఆర్‌ను రూ.7 వేల కోట్లకు అమ్మారని ఆరోపించారు. రూ.700 కోట్ల గొర్రెల పంపిణీలో భారీ అక్రమాలు జరిగాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం ఇటీవల రూ.80 వేల కోట్లు ఖర్చు చేశామన్న బీఆర్ఎస్, ఇప్పుడు రూ.94 వేల కోట్లు అంటోందని విమర్శించారు.అయితే తాము ఓఆర్ఆర్‌ను విక్రయించలేదని, అది తిరిగి ప్రభుత్వానికే వస్తుందని హరీశ్ రావు తెలిపారు.




### నీతి ఆయోగ్ భేటి...

# దీదీ వాకౌట్

- ప్రధాని మోదీ అధ్యక్షత
- 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశం

**టీ మీడియా, జులై27,న్యూఢిల్లీ:**
రాష్ట్రపతి భవన్‌లోని కల్చరల్ సెంటర్‌లో శనివారం నాడు నీతి ఆయోగ్ సమావేశాన్ని కేంద్రం నిర్వహించింది. దీనికి ప్రధాని మోదీ అధ్యక్షత వహించారు. దీనిలో పలు రాష్ట్రాల సీఎంలు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, కేంద్ర మంత్రులతో పాటు నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్, సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా ఈ ... తీర్చిదిద్దడానికి తీసుకోవాల్సిన చర్యలే ఈ భేటీ ప్రధాన అంజెండా చర్చలు జరిపారు.. ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఈ భేటిలో పాల్గొన్నారు., . విపక్ష పార్టీలకు చెందిన పలువురు సీఎంలు దీనిని బాయ్‌కాట్ చేయగాపశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత మాత్రం హాజరయ్యారు. మరోవైపు ఎన్డీయేలో కీలక భాగస్వామి అయిన జేడీయూ అగ్రనేత, బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ఈ సమావేశానికి గైర్హాజరయ్యారు. తనకు బదులుగా డిప్యూటీలను పంపారు. అయితే ఆయన గైర్హాజరుకు గల కారణం మాత్రం తెలియరాలేదు.

**దీదీ వాకౌట్..**
సభకు హాజరైన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. రాష్ట్రానికి నిధుల కేటాయింపు గురించి మాట్లాడటం ప్రారంభించగానే తన మైక్ ఆఫ్ చేశారని ఆరోపిస్తూ ఆమె సమావేశం నుంచి బయటకు వచ్చారు. "కేంద్ర బడ్జెట్‌లో పశ్చిమబెంగాల్‌పై వివక్ష చూపారని, రాష్ట్రానికి నిధులు కేటాయించాలంటూ మాట్లాడటం ప్రారంభించగానే వారు నా మైక్ ఆపేశారు. నేను మాట్లాడకుండా అడ్డుకున్నారు. ఎందుకు వివక్ష చూపుతున్నారని నేను ప్రశ్నించాను. విపక్షాల నుంచి హాజరైంది నేను ఒక్కదాన్నే. నన్నొక్కదాన్ని కూడా వారు ఆపారు. మిగతా సభ్యుల మాదిరిగానే మాట్లాడేందుకు నాకు తగిన సమయం ఇవ్వకపోవడం అవమానించడమే" అని మమత ఆరోపించారు. ఈ చర్య అన్ని ప్రాంతీయ పార్టీలను అవమానించడం కిందికే వస్తుందని విమర్శించారు. భవిష్యత్తులో ఇంకెప్పుడూ నీతి ఆయోగ్ సమావేశానికి హాజరుకానని అన్నారు.

**బిజెపి కౌంటర్..**
ఆమె ఆరోపణలపై భాజపా స్పందించింది. విపక్షాలకు చెందిన కొందరు బాయ్‌కాట్ చేసేందుకు నీతి ఆయోగ్‌ను ఒక వేదికగా మార్చుకున్నారని అన్నారు. రేవంత్ సహా పలువురు సిఎంలు బాయ్ కాట్ ఈ సమావేశానికి విపక్ష ఇండియా కూటమి పార్టీలకు చెందిన నేతలు పలువురు గైర్హాజరయ్యారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వివక్ష చూపారంటూ నిరసిస్తూ తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేరళ, పంజాబ్, కర్ణాటక హిమాచల్ ముఖ్యమంత్రులు ఈ సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు.

# ఢిల్లీలో బిజీబిజీగా చంద్రబాబు..

- పోలవరంపై కీలక కామెంట్స్



**టీ మీడియా , జులై 27,ఢిల్లీ:** ఏపీ సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. నీతి ఆయోగ్ భేటీలో పాల్గొన్న తర్వాత ఆయన కేంద్ర మంత్రులతో సమావేశం అవుతున్నారు. కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి తాజా ప్రతిపాదనలకు ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రిని బాబు కోరినట్లు తెలుస్తోంది. పోలవరం ప్రాజెక్ట్ మొదటి దశకు అవసరమైన రూ.12,500 కోట్ల ప్రతిపాదనలను ఆమోదించాలని కేంద్ర మంత్రి పాటిల్‌ను చంద్రబాబు కోరు. కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు.తర్వాత మీడియాతో చిట్‌చాట్ చేసిన చంద్రబాబు వైసీపీ హయాంలో పోలవరం ప్రాజెక్టును నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ చేసిన నష్టాన్ని పూడ్చే బాధ్యత ప్రజలు ఎన్డీయేకు అప్పగించారన్నారు. కేంద్రాన్ని పాత బకాయిలే అడిగామని, కొత్తగా ఏదో ఇచ్చారంటూ రాజకీయం చేయడం సరికాదన్నారు బాబు. గత ఐదేళ్లలో వైసీపీ సర్కార్ ఇష్టారాజ్యంగా కేంద్రం నిధులను దారి మళ్లించిందని, ఇదే విషయాన్ని కేంద్రంలోని ఆయా శాఖలు చెబుతున్నాయన్నారు. నవంబర్ నాటికి పోలవరం నిధులు విడుదల చేస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

# ప్రాణాలు అరచేతిలో పెట్టుకు విధులు

- భయపెడుతున్నా పాఠశాల భవనాలు
- గొడుగులు పట్టుకుంటేనే సాగుతున్న చదువులు



**టీ మీడియా, జూలై 27, ఆదిలాబాద్ :**
ఎప్పుడు ఊడిపడుతాయో తెలియని పైకప్పులు. వర్షపు నీటితో పాకురు పట్టిన గోడలు, నీళ్లదారలతో తడిచి ముద్దవుతున్న గదులు. పగిలిపోయి దర్శనమిస్తున్న ఫ్లోర్ టైల్స్.. హఠాత్తుగా దర్శనమిస్తున్న విష సర్పాలు. ఇది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని శిథిల భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాల పరిస్థితి. వారం రోజులుగా వర్షాలు దంచి కొడుతుండటంతో ఆ శిథిల భవనాలు మరింత ప్రమాదకరంగా మారి భయపెడుతున్నాయి.
నిర్మల్ , ఆదిలాబాద్, మంచిర్యాల , ఆసిఫాబాద్

మిగతా 3లో..

# మాజీ రాష్ట్రపతికి సీఎం నివాళులు

**టీ మీడియా,జులై 27,హైదరాబాద్ బ్యూరో :**
మాజీ రాష్ట్రపతి, ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గారి వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిఘనంగా నివాళులర్పించారు. సీఎం నివాసంలో పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి కలాం గారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. దేశం కోసం జీవితాన్ని ధారపోసిన మహనీయుడు స్వర్గీయ కలాం గారని ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. ఒక శాస్త్రవేత్తగా భారత రక్షణ పరిశోధనా రంగంలో, అంతరిక్ష పరిశోధనా రంగంలో కలాం గారు చేసిన కృషిని దేశం ఎప్పటికీ విస్మరించబోదని సీఎం పేర్కొన్నారు. తన రచనలతోనూ యువతలో దేశ సేవ పట్ల స్ఫూర్తి నింపిన మహనీయుడు కలాం గారు అని ముఖ్యమంత్రి గుర్తుచేశారు.



## బిఆర్ఎస్ ప్రభుత్వం పెట్టిన కేసులను ఎత్తివేయాలి

3లో..

-ముఖ్యమంత్రిని కలిసిన సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు

## రైతులను ఢిల్లీకి కాకుండా పాకిస్థాన్‌కు పంపాలా?

3లో..

-పంజాబ్ సీఎం భగవంత్ మాన్




3లో..

# ప్రతి రైతుకు వ్యవసాయ విస్తీర్ణాధికారి సూచనలు ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**టీ మీడియా, జులై 27, వనపర్తి బ్యూరో :**

వనపర్తి జిల్లా రైతులు ఆధునిక పద్ధతులలో లాభసాటి సేద్యం చేసేందుకు ప్రతి రైతుకు వ్యవసాయ విస్తీర్ణాధికారి సూచనలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం ఉదయం వనపర్తి పట్టణంలోని పాత మార్కెట్ గంజిలో గ్రోమోర్ ఫర్టీలైజర్ షాపును జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. అప్పుడే ఎరువులు కొనుగోలు చేయడానికి వచ్చిన పానగల్ మండలం కొత్తపేట గ్రామ రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ఎంత పొలం ఉంది, ఏ పంట వేస్తున్నారు, ఏ రకమైన మందులు వాడుతున్నారు, ఎకరాకు ఎంత మోతాదులో రసాయనిక ఎరువులు వాడుతున్నారు అని రైతుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందుకు సమాధానాలను ఇచ్చిన రైతులకు ఇవన్నీ మీకు ఎవరు చెప్పారు? మీ వ్యవసాయ విస్తిర్ణాధికారి మీకు సలహాలు సూచనలు ఇచ్చారా? అని ప్రశ్నించారు. ప్రతి క్లస్టర్ లో వ్యవసాయ విస్తీర్ణాధికారులు రైతులకు అందుబాటులో ఉండి సలహాలు సూచనలు చేయాలని, ఇదే విషయమై మండల వ్యవసాయ అధికారులు మండల స్థాయి సమావేశాలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఎరువుల నిల్వలు, రిజిస్టర్ పరిశీలించారు. రిజిస్టర్ లో ఉన్న నిల్వలు ఈ పాస్ యాప్ లో ఉన్న నిల్వలతో సరిపోల్చి చూశారు. అనంతరం పానగల్ మండలం అన్నారం గ్రామం చేరుకొని ఎక్కడ రైతులతో వ్యవసాయ విస్తీర్ణాధీకారి క్రాప్ బుకింగ్ చేస్తున్న ప్రక్రియను పరిశీలించారు. బాలయ్య రైతు తన 4 ఎకరాల పొలంలో వరి సాగుచేయడాన్ని క్రాప్ బుకింగ్ విధానాన్ని పరిశీలించారు.

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్య పెంచాలి**

పానగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ గర్భిణీలు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను ఆదేశించారు. రిజిస్టర్లు పూర్తిస్థాయిలో లేకపోవడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి గర్భిణీ మహిళకు మొదటి త్రైమాసికంలోనే ఎ.ఎన్.సి. పరీక్షలు చేసి ఆన్లైన్ తో పాటు రిజిస్టారులో నమోదు చేయాలని, సుమారుగా ప్రసవం జరిగే తేదీలను సైతం నమోదు చేయాలని సూచించారు. రోజుకు ఎంతమంది ఓ .పి లు వస్తున్నారు, టి. హబ్ వాహనం ఎన్ని గంటలకు వస్తుంది, రక్త పరీక్షల రిపోర్టు ఎప్పుడు ఇస్తున్నారు వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. మందుల నిలువలు పరిశీలించి ఏమైనా లోటు ఉందా అని అడిగి తెలుసుకున్నారు. ప్రసూతి గదిలో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో మొక్కను నాటారు. అమ్మ ఆదర్శ పాటశాల పనులు త్వరగా పూర్తి చేయాలి పానగల్ మండలం అన్నారం తాండా లో ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్ అమ్మ ఆదర్శ పాటశాల పనులను పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, పనిలో నాణ్యత పాటించాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి, ఏ . ఈ.ఒ లు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. జయచంద్ర మోహన్, డా. సాయినాథ్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ పరిమళ, వైద్య సిబ్బంది తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# మాట్లాడుతుంటే మైక్ కట్

- నీతి ఆయోగ్ నుండి మమతా బెనర్జీ వాకౌట్ ..!



**టీ మీడియా,జులై 27,న్యూఢిల్లీ :**

ప్రధానమంత్రి మోడి అధ్యక్షతన న్యూఢిల్లీలో నేడు జరుగుతున్న నీతి ఆయోగ్ సమావేశానికి హాజరైన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సభ మధ్యలోనే వాకౌట్ చేశారు. సమావేశంలో ఇతరులు దాదాపు 20 నిమిషాల పాటు మాట్లాడారని, అయితే తనకు కేవలం 5 నిమిషాలు మాత్రమే మాట్లాడటానికి అనుమతించారని మమతా తెలిపారు. మిగతా సభ్యుల మాదిరిగానే మాట్లాడేందుకు తనకు తగిన సమయం ఇవ్వకపోవడం అవమానించడమేనన్నారు. బెంగాల్‌కు నిధులు ఇవ్వాలని కోరినప్పుడు, ప్రణాళికా సంఘాన్ని తిరిగి తీసుకురావాలని, కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల గురించి ఆలోచించాలని, వివక్ష చూపవద్దని కోరినప్పుడు తన మైక్‌ను మ్యూట్ చేశారని ఆరోపించారు. ఈ చర్య బెంగాల్‌కు అవమానంగా భావించిన మమతా బెనర్జీ సభ నుండి బయటకు వచ్చేశారు. ఆమె చర్యపై బిజెపి స్పందిస్తూ %ొ% విపక్షాలకు చెందిన కొందరు బాయ్ కాట్ చేసేందుకు నీతి ఆయోగ్‌ను ఒక వేదికగా మార్చుకున్నారని విమర్శించింది.

# ప్రతి బస్సుకు పవర్ డోర్ సౌకర్యం కల్పించాలి

- టీజేఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్



**టీ మీడియా, జులై 27, వనపర్తి బ్యూరో :**

టీజేఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ వనపర్తి డిపో కమిటీ ఆధ్వర్యంలో వనపర్తి డిపో మేనేజర్ కి వినతి పత్రం సమర్పించినారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా బస్సులలో మహిళా ప్రయాణికులు అధిక సంఖ్యలో ప్రయాణించడం వలన ప్రయాణికులు డ్రైవర్ కండక్టర్లు ఎంత చెప్పినా డోర్ దగ్గర నుండి లోపలికి పోవడం లేదు అందువలన బస్సులలో తరచుగా ప్రయాణికులు బస్సుల డోర్ లో నుండి జారిపడి మరణించడం జరుగుతుంది. అందుకొరకు ప్రతి బస్సుకు పవర్ డోర్ సౌకర్యం కల్పించాలని ఈ ప్రమాదాలకు డ్రైవర్ కండక్టర్ల పై చర్యలు తీసుకోకూడదని డిఎం ని కోరడమైనది. ఆత్మకూరు, ఘణపురం, మహబూబ్ నగర్ రూట్లో టైమింగ్స్ సరి చేయాలని తదితర అంశాలపై వనపర్తి డిపో మేనేజర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి ఏ కృష్ణయ్య అధ్యక్షులు జె.వి. స్వామి, రీజియన్ సహకార దర్శి ఎండి ఖయ్యూం, డిపో ప్రచార కార్యదర్శి సి .నాగేశ్వర్, సహకార దర్శి గోవర్ధన్ కోశాధికారి ఏజీ. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లు ఆక్రమించిన దుకాణాల యజమానులు

- చర్యలు తీసుకోని సవరించాలని డిమాండ్ చేస్తున్న అఖిలపక్ష ఐక్యవేదిక

**టీ మీడియా, జులై 27, వనపర్తి బ్యూరో :**

వనపర్తి జిల్లా కేంద్రంలో సుందరీకరణ రోడ్లు ఆక్రమించిన షాప్ యజమానులు, బండ్లు, ఆటోలు, డబ్బాలు, పట్టించుకోని అధికారులు. ఆక్రమణలకు వత్తాసు పలుకుతూ జేబులు నింపుకుంటున్న కొందరు ప్రజాప్రతినిధులు. ప్రమాదాలకు గురవుతున్న పాదాచారులు, వాహనదారులు.వెంటనే చర్యలు తీసుకోని సవరించాలని అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు . గత కౌన్సిల్ లో కొన్ని రోడ్లను సెలెక్ట్ చేసి సుందరీకరణ పేరుతో అభివృద్ధి చేయాలని 20 కోట్లు బ్యాంక్ అప్పుగా తీసుకున్న మున్సిపాలిటీ. జిల్లా కేంద్రానికి వచ్చిన పురపాలక శాఖ మాజీ మంత్రి కేటీఆర్ అట్టహాసంగా ప్రారంభించేసి వెళ్లారు అయితే వాటి పేరుపై రాజీవ్ చౌక్ నుండి డిపో వరకు, బస్టాండ్ పక్క నుండి సివి రామన్ కాలేజ్ వరకు రోడ్లు మాత్రమే వేయడం జరిగింది. అయినా 60 ఫీట్ లో 40 ఫీట్ల రోడ్లను వేశారని ప్రజలు సంతోషపడ్డారు. కానీ ఇప్పుడు చూస్తే ఆ రోడ్ల లో ప్రజలు కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా ఆక్రమించుకున్నారు. కొందరు షాప్ యజమానులు,బహుళ అంతస్తుల కు ట్రాన్స్ ఫారంలు, మరికొందరు తమ షాప్ లో పెట్టే సామాన్లు మొత్తం రోడ్డుపైనే పెట్టి ఆక్రమించారు. కొందరు ప్రజాప్రతినిధులు డబ్బులు తీసుకుని డబ్బాలను, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఏర్పాటు చేయించారు. బహుళ అంతస్తులలో షాపింగ్ మాల్ , హాస్పిటల్, పెద్ద పెద్ద షాపులకు పార్కింగ్ ప్లేస్ లేకుండానే అనుమతి ఇవ్వడంతో రోడ్లపైనే ఆటోలు బండ్లు టూ వీలర్స్ పెట్టడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.



కమిషనర్ ఇతర అధికారులకు ఫోన్ చేస్తే పట్టించుకోవడం లేదు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్ లతో కొందరు డబ్బాలతో డైరెక్ట్ గా డబ్బులు తీసుకుంటున్నారని అపవాదు కూడా ఉంది. దీన్ని పూర్తిగా పరిశీలించి వనపర్తి ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ని అఖిలపక్ష ఐక్యవేదిక డిమాండ్ చేస్తున్నది.వనపర్తి లో కొందరు ప్రజాప్రతినిధులు పూర్తిగా వీటిపైనే సంపాదిస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. కొందరు బ్రోకర్లు ఒక జట్టుగా తయారై వనపర్తిలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో ఉంటూ మేమే అంతా అనుకుంటూ చెప్పుకుంటూ తిరుగుతూ, వీటి వెనుక ఉన్నారని సత్యం. పాలిటెక్నిక్ ఎదురుగా ఒకవైపు రోడ్డు వెడల్పు 40 చేశారు ఇంకోవైపు 40 ఫీట్లు చేయకుండా 34 ఫీట్లకే చేశారు. ఆ స్థలంలోనే మళ్లీ పార్కింగ్ పేరుతో వెహికల్స్ నిలబెడితే రోడ్డు మొత్తం 20 ఫీట్ల గాని ఉంది. అక్కడ కొందరు రాజకీయ నాయకుల కోసం విడిచి పెట్టారనే నిజం అన్నారు.

## కందకంలో పిచ్చి మొక్కలను తొలగించాలి

**టీ మీడియా, జులై 27, వనపర్తి బ్యూరో :**



వనపర్తి జిల్లా కేంద్రంలోని 21 వార్డ్ హరిజనవాడలో కందకంలో నిర్మిస్తున్న సమీకృత కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులు పునాదితోనే నిలిచిపోయాయి. కాంట్రాక్టర్ల అలసత్వం, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో కోట్ల రూపాయల ప్రజాధనం వృధాగా మారాయి . దాదాపు కోటి 26 లక్షల నిధులతో మొత్తం 143 షాపులను నిర్మించవలసి ఉండగా కాంట్రాక్టర్ పునాది పిల్లర్ దశ వరకు పూర్తి చేసి బిల్లులు రావడం లేదని పనులు నిలిపివేశారు. దాంతో ఇప్పుడు అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన షెడ్లు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారింది. నిత్యం మందు బాబులు ఆగడాలు పెరగడంతో చుట్టు పక్కల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షకాలం కావడంతో పిచ్చి మొక్కలు పెరిగి కుక్కలు, పందులు, పాములుతో చుట్టు పక్కల ఉండే ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. పెరిగిన పిచ్చి మొక్కలతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెరిగిన పిచ్చి మొక్కలతో విష పురుగులు వస్తాయని తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ కమిషనర్, చైర్మన్, కౌన్సిలర్ స్పందించి పిచ్చి మొక్కలను తొలగించాలని స్థానిక ప్రజలు కోరారు . వర్షానికి పాములు రెండు రోజుల క్రితం ఒక పాము ఇంటిలోకి వచ్చిందని తెలిపారు.

## రిటైర్డ్ ఏఎస్ఐని పరామర్శించిన రావుల

**టీ మీడియా, జులై 27, వనపర్తి బ్యూరో :**



ఖిల్లా ఘనపూర్ మండల నమస్తే తెలంగాణ జర్నలిస్టు బాలరాజు తండ్రి రిటర్డ్ ఏఎస్ఐని రాములు పక్షవాతంతో బాధపడుతూ నాంపల్లి కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రావుల చంద్రశేఖరరెడ్డి మాజీ ఎం.పి రాములు ని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

## గనిని సందర్శించిన డైరెక్టర్

**టీ మీడియా జులై 27 గోదావరిఖని ప్రతినిధి:**



ఆర్. జి-1 ఏరియా, జీ.డి.కే -11 ఇంక్లైన్ గనిని సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్ అండ్ బి కే శ్రీనివాస్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా భూగర్భ గనిలో కి దిగి 1. సీమ్ ను సందర్శించి, లోపల జరుగుతున్న పలు పనులను పరిశీలించారు. కార్మికులు, అధికారులు రక్షణ చర్యలు పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్. జీ-1- ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ ,కాలనీ మేనేజర్ నెహ్రూ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## డయల్ 100,112 ఎల్లప్పుడూ అందుబాటులో

- రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్

**టీ మీడియా, జులై 27, గోదావరిఖని ప్రతినిధి:**



పోలీసులపై ప్రజల్లో మరింత నమ్మకం పెరిగే దిశగా డయల్ 100,112 వెంటనే స్పందించి చర్యలను చేపడుతున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గల పెద్దపల్లి మంచిర్యాల డిసిపి, ఏసిపి, సీఐ,ఎస్ఐ, బ్లూ కోల్ట్స్ పెట్రో కార్ సిబ్బందితో డయల్ 100,112 ఫోన్ కాల్ స్పందన పనితీరు పై జూమ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ 100 డయల్ కు సమాచారం వచ్చిన వెంటనే సంఘటన స్థలానికి బ్లూ కోల్ట్స్, పెట్రోల్ కార్ 24 గంటలు అందుబాటులో ఉంటారని, ప్రజలకు చేరువగా ఉండాలని అంటూ వెంటనే స్పందించి సకాలంలో చేరుకొని ఆయా సమస్యల పరిష్కారం దిశగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. కళాశాల, బస్టాండ్ ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ డయల్ కాల్ విషయంలో ఎస్ఐ,సీఐ, ఎసిపిల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు ప్రతి అంశం రికార్డు జరుగుతుందన్నారు. ఈ సమీక్ష సమావేశంలో పెద్దపెల్లి డీసీపీ చేతన,భాస్కర్,అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు,స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీబీ ప్రతాప్, కమిషనరేట్ పరిధిలోని ఏసిపి, సీఐ, ఎస్ఐ లు, బ్లూ కోల్ట్స్ పెట్రో కార్ సిబ్బంది సి సి సీఐ స్వామి, ప్రమోద్ రావు, శ్రీధర్, దామోదర్, మధు పాల్గొన్నారు.

# నీది హాఫ్ నాలెడ్జ్...నీవు ఓ పెద్ద డమ్మీ..

- అసెంబ్లీలో హరీష్ రావు , కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- డమ్మీ మంత్రి, డమ్మీ అల్లుడివి అంటూ చురకలు



**టీ మీడియా, జులై27,హైదరాబాద్ :**

తెలంగాణ అసెంబ్లీలో 2024-25 వార్షిక బడ్జెట్ పద్దుపై చర్చ హాట్ హాట్‌గా కొనసాగింది. ఈ సందర్భంగా హరీష్ రావు, మంత్రి కోమటిరెడ్డి మధ్య మాటల యుద్ధం నడిచింది. 2001లో కొండా లక్ష్మణ్ బాపూజీ ఇంట్లో పార్టీ పెట్టినప్పుడు తెలంగాణ వస్తే దళితుడినే సీఎం చేస్తామని చెప్పి అబద్ధాలను ఆనాటి టీఆర్ఎస్ ప్రస్తుత బీఆర్ఎస్ మొదలు పెట్టిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో 24 గంటల కరెంట్ ఇచ్చామని చెబితే తాను ఓ సబ్ స్టేషన్ కు వెళ్లి పరిశీలించానని అక్కడే పని చేసే ఆపరేటర్ 9 ఏళ్ల నుంచి ఏనాడు 14 గంటల విద్యుత్ సప్లై కాలేదని చెప్పారని కోమటిరెడ్డి గుర్తు చేశారు. మోసాలు, అబద్ధాలు బీఆర్ఎస్ పార్టీ ఏర్పడిన నాటి నుంచే పుట్టాయని మంత్రి సెటైర్లు వేశారు.దళితుడిని ముఖ్యమంత్రి చేస్తామని చెప్పి దళిత ప్రతిపక్ష నాయకుడు ఉంటే 13 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సంతలో పశువులను కొన్నట్లు ఆనాడు కొని కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హెూదా లేకుండా చేశారని కోమటిరెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ బడ్జెట్‌పై చీల్చిచెండాడుతాడని పత్రికల్లో వార్తలు వస్తే తాను తొమ్మిది గంటలకు వచ్చి కూర్చున్నానని అయితే కేసీఆర్ కు వచ్చే మొఖం లేక హరీష్ రావును పంపారన్నారు.ఈ వ్యాఖ్యలకు మాజీ మంత్రి హరీష్ రావు స్పందిస్తూ.. కోమటిరెడ్డికి 'హాఫ్ నాలెడ్జ్' ఉందనడంతో సభలో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. దీంతో స్పీకర్ కల్పించుకుని హాఫ్ నాలెడ్జ్ పదం విరమించుకోవాలని హరీష్ రావును కోరి రికార్డుల నుంచి తొలగించారు. దీనికి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. హరీష్ రావుకు ఆకారం పెరిగిందని అసలు నాలేడ్జ్ లేదని కౌంటర్ ఇచ్చారు. హరీష్ రావు గతంలో డమ్మీ మినిస్టర్ అని, డమ్మీ అల్లుడు అని కోమటిరెడ్డి ఘాటు విమర్శలు చేశారు.

## నూతన తహసిల్దార్ భవనాన్ని మంజూరు చేయండి

**టీ మీడియా, జులై27,పెద్దపల్లి బ్యూరో :**





పెద్దపల్లి జిల్లా శ్రీరాంపూర్ మండల కేంద్రం లో ఉన్నటువంటి తహసిల్దార్ కార్యాలయ భవనం గత 30 సంవత్సరాల కింద నిర్మించ బడడంతో అది పూర్తిగా శిథిలమై కూలిపోయే స్థితిలో ఉంది అదేవిధంగా ఎప్పుడు వర్షాలు కురిసిన దానిలోనికి ఊట నీళ్లు చేరి కురుస్తూ ఆఫీస్ సిబ్బందికి గాని తహసిల్దార్ కార్యాలానికి వచ్చే ప్రజలకు గాని తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాల ప్రభావంతో ఆఫీసులోని విద్యుత్ సరఫరా లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడుతుందని ఆఫీస్ సిబ్బంది తరచూ భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇటీవల శ్రీరాంపూర్ మండల కేంద్రానికి మంత్రుల బృందం పర్యటించడంతో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ అనుభవం కల నాయకుడిగా ముందుకు వచ్చి నూతన తాసిల్దార్ భవనాన్ని మంజూరు చేయాలని వినతి పత్రం అందజేయడం జరిగింది. దీని దృష్టిలో ఉంచుకొని గత మూడు నాలుగు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు ఆఫీసులోకి నీరు రావడంతో కలెక్టర్ సంబంధిత మంత్రివర్యులు వెంటనే చొరవ తీసుకొని నూతన తాసిల్దార్ భవనాన్ని మంజూరు చేయాలని మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

## మహానందిలో కలకలం రేపుతున్న చిరుత సంచారం

- బెంబేలెత్తుతున్న ప్రజలు, భక్తులు..
- ప్రాణ హాని జరిగే వరకు స్పందించరా...?
- నిర్లక్ష్య ధోరణిలో అటవీ శాఖ అధికారులు..



**టీ మీడియా, జూలై 27, మహానంది:**

మహానందిలో చిరుత పులి సంచారం ప్రజలు, భక్తులను భయాందోళనలకు గురిచేస్తుంది. శుక్రవారం రాత్రి మహానంది దేవస్థానంలోని గోశాల వద్ద చిరుత పులి సంచరిస్తున్నట్లు దేవస్థానం అధికారులు సీసీ ఫుటేజ్ ల ద్వారా శనివారం ఉదయం గుర్తించారు. శుక్రవారం రాత్రి గోశాల వద్ద చిరుత సంచరిస్తుండగా, గోశాల కాపలాగా ఉన్న వ్యక్తి కేకలు వేయడంతో సమీపంలోని అడవి ప్రాంతంలోకి పారిపోయింది.

ఆలయ పరిసరాల్లో సుమారు గత రెండు నెలలుగా చిరుత సంచారంతో, భక్తులు, గ్రామస్తులు, భయాందోళనలకు గురి అవుతున్నారు.ఎవరికో ఒకరికి ప్రాణహాని జరిగితే గాని, చిరుతను బదించేందుకు చర్యలు తీసుకుంటారని గ్రామస్తులు వాపోతున్నారు. మనుషుల ప్రాణాలు పోయేంతవరకు అటవీశాఖ అధికారులు చిరుతను బదించేందుకు చర్యలు తీసుకోరా అని మహానంది ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గత 20 రోజుల క్రితం బహిర్భూమికి వెళ్లిన గిరిజన యువకున్ని చిరుత గాయపరిచింది. గత 15 రోజుల క్రితం కృష్ణ నంది సమీపాన పంట పొలాల్లో చిరుత సంచరిస్తే కూడా అటవీశాఖ అధికారుల స్పందన లేదు. నాలుగు రోజుల క్రితం అదే ప్రాంతంలో మళ్లీ చిరుత కనిపించడంతో ఆ ప్రాంత ప్రజలు కేకలు వేసి, టపాకాయలు పేల్చడంతో చిరుత అడవిలోకి పారిపోయిందని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయాలను గూర్చి, చిరుత సంచారం గూర్చి అటవీ శాఖ అధికారులతో తెలిపితే ఈ ప్రాంతమంతా అడవి ప్రాంతం కావున చిరుత దాని సరిహద్దుల్లో అది సంచరిస్తుందని అటవీ శాఖ ఉన్నతాధికారి కొట్టిపారేస్తున్న సందర్భాలు ఉన్నాయి.అటవీ శాఖ అధికారులు మాత్రం చిరుతను బంధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, గత 15 రోజులుగా చెబుతూనే ఉన్నారు.మహానందిలో క్షేత్రంలోనూ గత రెండు నెలలుగా చిరుతపులి సంచారంతో ,ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. మహానంది క్షేత్ర పరిసరాలలో చిరుతపులి సంచరిస్తున్న,అటవీ శాఖ అధికారులుపులిని బంధించడంలో అలసత్వం ఎందుకు వహిస్తున్నారో, అని ప్రజలు, భక్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు నిర్లక్ష్య ధోరణి వీడి, ప్రజల,భక్తుల ప్రాణాల కోసం స్పందించి, చిరుతను పట్టుకొనే చర్యలు చేపట్టి, ప్రజలను చిరుత భారీ నుండి కాపాడాలని కోరుతున్నారు.

## రోడ్డుపై వరి నాటు వేసే నిరసన తెలిపిన, గ్రామస్తులు

**టీ మీడియా, జులై 27, ఓదెల:**



పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గూడెం గ్రామంలో వ్యవసాయ భూములకు వెళ్లే రోడ్లకు ఇటీవల పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు,ఐదు లక్షలు మరమ్మత్తుల కోసం మంజూరు చేయించగా, మొరం పోయకుండా,రోడ్డుపై బురద మట్టిని పోసి పూర్తి చేయడం జరిగింది, అని ఇప్పుడు ఆ రోడ్లపై కనీసం బైకు వెళ్లే పరిస్థితి లేదు, అని పూర్తిగా బురదమయం కావడంతో జారిపడి కొందరికి గాయాలు కూడా అయ్యాయి,అని ఈ పనిని నిరసిస్తూ గూడెం బి ఆర్ ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో రోడ్లపై వరి నాట్లు వేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఉప్పుల శ్రీనివాస్, మాజీ గ్రామ సర్పంచ్ ఉష్క మల్ల చంద్రమౌళి, రైతు సమన్వయ సమితి కన్వీనర్ రేగుల సంపత్, కుల కాని సతీష్, తిప్పారపు రాజేందర్, రఘుపతి, బెదిగం ముని, బుడిగె కుమారస్వామి, ఇటికాల ప్రవీణ్, కటుకూరి రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు

**టీ మీడియా ,జులై 27, ఓదెల:**



పెద్దపెల్లి జిల్లా ఓదెల మండలం,పోత్కపల్లి గ్రామంలో, పెద్ద చెరువు, మొదటి తుము మూల వద్ద, బైక్ పై వెళ్తున్న వారిని, వేగంగా వస్తున్న, కార్, ఢీకొనడంతో, బైక్ పై ఉన్న, దానవేణి కుమార్ 35, అతని కుమారుడు, దానవేణి అర్జున్ సాయి 12, పొలంలో పడడం జరిగింది, వారికి, తీవ్ర గాయాలవడంతో, స్థానికులు చూసి, 108 సిబ్బందికి ఫోన్ చేయగా వచ్చి కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు, ఇద్దరికీ, కాలులో రెండు ఫ్యాక్చర్లు, తండ్రికి నడుము ఫ్రాక్చర్ అవ్వడం జరిగింది,మరియు పోలీసు వారికి, తెలియజేయడం జరిగింది, పోలీసులు వచ్చి బైక్ మరియు కారు ని పోలీస్ స్టేషన్ కు రెండు తరలించడం జరిగింది, కారుతో ఢీకొన్న వ్యక్తి, టంగుటూరి రమేష్, క్రషర్ యజమాని మంచిర్యాల, సంబంధించిన వ్యక్తిగా గుర్తించారు, దానవేణి కుమార్ అనే వ్యక్తి, తన దినచర్య, ట్రాలీ నడిపితే గాని సాగని కుటుంబం, నూతనంగా నిర్మించిన డబుల్ రోడ్డు కావడంతో, వాహనదారులు, వేగంగా రావడం జరుగుతుంది, ఏలాంటి ప్రమాద హెచ్చరికల, బోర్లు లేకపోవడం గమనార్ధం, ఇప్పటికైనా అధికారులు స్పందించి, మూలమలుపులపై ప్రమాద హెచ్చరిక బోర్డులను, నిర్మించవలసిందిగా స్థానికులు కోరుతున్నారు.

## చింతల హనుమాన్ దేవాలయానికి రోడ్డు వేయాలి

- బిజెపి పట్టణ అధ్యక్షుడు బచ్చురాము

**టీ మీడియా, జులై 27, వనపర్తి బ్యూరో :**



వనపర్తి పట్టణంలోని చిట్యాల రోడ్డులో చింతల హనుమాన్ దేవాలయం ఆర్చి దగ్గర రోడ్ల వెడల్పు ఎత్తు పెరగడం వలన హనుమాన్ టెంపుల్ రోడ్డు కిందికి అయింది. భక్తులు వర్షకాలంలో వస్తున్నప్పుడు బండి అదుపు తప్పి అయి కింద పడడం జరుగుతుంది. కాబట్టి సిసి రోడ్డు వేయాలని కోరడం జరిగింది. చిట్యాల రోడ్డులో కాంట్రాక్టర్ బీటీ రోడ్డు వేయకుండా వదిలి వేశారని వర్షం వస్తే మట్టి రోడ్డు గుంతలు ఏర్పడి దేవాలయంలోకి ప్రజలు వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొంటారు. వెంటనే మున్సిపల్ కమిషనర్ అధికారులు కానీ మున్సిపల్ చైర్మన్ స్పందించి లేదా వనపర్తి ఎమ్మెల్యే తూడీ మేఘారెడ్డి స్పందించి చింతల హనుమాన్ దేవాలయం ఆర్చి దగ్గర బిటి రోడ్డు వేయించాలని కాలనీవాసులు తెలపడం జరిగింది.

## 20 లీటర్ల నాటు సారా స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్

**టీ మీడియా, జూలై 27, మహానంది:**



మహానంది మండలం గాజులపల్లె గ్రామ పరిధిలోని బుచ్చమ్మ తోపులో నాటు సారా తయారీపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ శనివారం తెలిపారు. తమ పోలీస్ సిబ్బందితో కలిసి బైరి గోపి వ్యక్తికి చెందిన నాటు సారా స్థావరంపై దాడులు నిర్వహించి, 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని, 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. బుచ్చమ్మతోపు వద్ద బైరి గోపి అనే వ్యక్తి నుండి సారా స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎవరైనా నాటు సారాయిని తయారీ, రవాణా,విక్రయం చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో మహానంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

